అల్లుని అలుక

శ్రీమతి అద్దంపూడి అన్నపూర్ణమ్మగారు

విశ్వనాథానికి చిన్నప్పటినుంచీ చిల్లరతిళ్లులంటే ఆశయెక్కువ. వాళ్లమ్మ ఎప్పుడూ యేజంతికలో, చేగోడీలో, పాలకాయలో ఏవోఒకటి చేసిపెడుతూనేవుండేది. అలావుంటే కూడా వాడికి చాలేదికాదు. అస్తమానూ విశ్వనాథానికి తిండివుంటేచాలు. ఇవేవైనా ఒకపూట లేకపోతే ఆవేళ ఇల్లు ఇల్లులాగుండదు. అప్పుడు యేమీతోచక వాళ్లమ్మ డబ్బులు ఇచ్చును. ఆడబ్బులు తీసుకుపోయి యేపకోడీలో, ఖారప్పూసో యేవోఇలాటివి కొనుక్కుని తినును. ఇవీచాలక సూరమ్మచూడనప్పుడు గదులపెట్టెలో యేమైనా డబ్బులున్నాయేమో అని వెదుకును. దొరికేయిఅంటే పట్టుకునివెళ్లిపోవును. లేకపోతే వడ్లో, బియ్యమో, చోళ్లో, జొన్నలో ఇలాటివేవైనా పట్టుకుపోయి కొనుక్కునితినును.

విశ్వనాథంతండ్రి సాంబయ్యగారికి భూముల్లోనుంచి ధాన్యపుసరుకులు పండుతాయి. పెద్ద పెంకుటిల్లూ తోటాదొడ్డీ అన్నీవున్నాయి. ఎప్పుడుచూస్తేనూ బస్తాలుబస్తాలుగా ధాన్యం, జొన్నలూ ఇలాటివి కట్టిపడివుంటాయి. విశ్వనాథం ఒక్కడేపిల్లవాడు. తరువాత పిల్లలులేరు. అందుచేత తల్లిదండ్రులకు గారాబమూయెక్కువ. విశ్వనాథానికి ఇరవై రెండేళ్లు; ఎన్నియేళ్లుఅయితేనేమి? వాడిచిరితిండీ ఆతిండికోసం దొంగతనం ఇంకా మానలేదు.

విశ్వనాథం ఈకాలంమనిషికాడు; కొంచెంఅమాయకుడు. చూపుకు అంతఅందగాడు కాడు. పెద్దతల, చిన్నపిలకజుట్టుముడీను. ఆతనికిసాయంగా చిన్నచెవులూ, పొట్టిమెడాను. కొంచెంస్థూలమైనవాడే; వాడునడుస్తూవుంటే ఆడుతూన్నట్టుంటుంది. సంగీతంయేమీరాకపోయినా ఎప్పుడుచూస్తేనూ తింటూ కూనిరాగంతీస్తూ కూచునివుంటాడు. అప్పుడు మనకు చూడబుద్ధివేస్తుంది. చదువుఅట్టేరాదు. ఏదోఅక్షరజ్ఞానంవుంది. ఆలాటి పల్లెటూరివాళ్లకు పెద్దపెద్దచదువులు యేలావస్తాయి?

విశ్వనాథానికి పెళ్లిఅయి రెండేండ్లయింది. ఈరెండేళ్లనుంచీ వాడికికొంచెం యెవళ్లైనా యెదురు చెప్పేరంటే అత్తవారింటికి బయలుదేరుతాడు. వీడికిసాయంగా అత్తారిల్లుకూడా దగ్గిరగానేవుంది. సాయంకాలం ఈవూరివాళ్లంతా సముద్రపుగట్టుకి షికారువెడతారు. ఆపల్లెటూరివాళ్లకి ఏముంది? ఏమీతోచకపోతే పాలానికెళ్లి నాలుగుమూల్లా యెవరేమి చేస్తున్నారో అని చూస్తారు. విశ్వనాథానికి ఆలాటివియేమీ అక్కరలేదు. ఎప్పుడుచూస్తేనూతినడం; తిండిదొరక్కపోతే దెబ్బలాడ్డం, దొంగతనంచేయడం, యెందుకో కాదు తినేందుకే; మిగతయేమీ తెలియదు. కూనిరాగంకూడా తెలుసును. ఈలాటివాడికి యెవరుపిల్లని ఇచ్చేరని మనకందరకీ సందేహంరావచ్చును. విశ్వనాథం అందం, చదువూ చూసి ఇవ్వలేదు. చాలాడబ్బుందికదా, ఒకేపిల్లవాడు, గింజాగిట్రాపండుతాయి అని ఇచ్చేరు.

విశ్వనాథానికి ఖారపుతిళ్లులంటే ఇష్టం; తీపూఇష్టమే. అన్నింటికన్నా తిప్పేలాబిళ్లలంటే యెక్కువఇష్టం. శనివారం యెప్పుడువస్తుందీ, మాఅమ్మ ఎప్పుడు తప్పేలాబిళ్లలు చేస్తుందీ అని ధ్యానంచేస్తూవుండేవాడు.

ఒకనాడు తెల్లవారి సూరమ్మకు మేనత్తవచ్చింది. పిల్లవాడికి తిండిఅంటే ఇష్టంఅని వచ్చేటప్పుడు పీకకాజాలున్నూ, పాతికజంతికలున్నూ పట్టుకొచ్చింది. వస్తూనే విశ్వనాథానికి ఇవోనాలుగూ అవోనాలుగూ ఇచ్చింది. అవి తినేసి వాళ్లఅమ్మనిమళ్లీ అడిగేడు. వాళ్లమ్మో కొంచెం ఇచ్చింది. అవీ తిన్నాడు. వాడికి ఇంకాచాలలేదు. ఏలాగో మధ్యాహ్నం రెండు గంటలదాకాజరిపేడు. అప్పుడువాళ్లమ్మని మెల్లిగా"నాకింకాపెట్టవా? అమ్మా!"అనిఅడిగేడు.

"అదేమిరా? విశ్వనాథం! ఆలాఅస్తమానూతింటే ఎలాగరా; వెధవతిండీ? తరవాత జబ్బుచేస్తే యెవరేడ్చేవాళ్లు? నీతిండి మండిపోనూ. చూసేవుటే; అత్తా! ఇదేవేపుకుతినడం. ఇందతినూ"అని ఇంతపట్టుకొచ్చి ఇయ్యడానికి వెళ్లింది. విశ్వనాథానికి కోపంవచ్చింది.

"నాకేమీవొద్దు. అంతానువ్వేతిను. నువ్వు తిట్టిందికాకుండా అందరితోటీ చెప్పడం కూడాను."అని ఆతక్షణంబయలుదేరి అత్తవారివూరికి చెప్పకుండా వెళ్లిపోయేడు.

విశ్వనాథంవెళ్లినతరువాత సూరమ్మనిచూసి "ఏమిటో వెర్రిబాగులవాడు. లేకపోతే ఈఅల్పానికేనాకోపగించుకోవడం?పెళ్లయితేవెళ్లేయిగాని, బుద్ధిమారలేదుగదా?సూరమ్మా!"

"ఈలాటివాడిని పెట్టుకుని యేలాగువేగుతున్నావే?" అంది అత్త.

"ఏమిటో. ఏంచేయనూ? ఒక్కపిల్లాడు. చిన్నప్పటినుంచీ వాడికి ఆలా సాగుతూంది. దానికిసాయంగా ఈఅత్తారిల్లోటి దొరికింది వాడికి అస్తమానూ. చీటికీమాటికీ పరుగెత్తడానికి" అనిచెప్పి సూరమ్మ కంటనీళ్లుపెట్టుకుంది.

విశ్వనాథం ఇల్లువిడచి బయలుదేరేటప్పుడే తినేందుకు కావలెనుగదా అని ధాన్యం కొంచెంపట్టికెళ్లి దారిపొడూగునా తనకు ఏమికావలెనో అవన్నీకొనితింటూ మెల్లిమెల్లిగా ఆడుతూపాడుతూ మధ్యమధ్య వేడుకలన్నీచూస్తూ రాత్రియేడుగంటలకు చదరాడ మామ గారిఇల్లుచేరేడు. విశ్వనాథం వెళ్లినతోడనే మామగారు సీతారామయ్య, అత్తగారు రవణమ్మ మర్యాదతోటి పిలిచి కాళ్లుకడుక్కోమని చెప్పేరు. అందరి క్షేమసమాచారాలు అడిగి, భోంచేసేవేళ అయినది అందరూ భోజనానికిరండి,అని చెప్పింది రవణమ్మ.

సీతారామయ్యగారికికొడుకులులేరు. కనకం ఒక్కత్తేపిల్ల. చాలాడబ్బువుంది. కనకానికి పదోయేటనేపెండ్లిచేసినారు. అల్లుడుఅప్పుడప్పుడువస్తాడు. ముద్దుముచ్చట్లన్నీచూసుకో వచ్చునని దగ్గిరవూరేచూసి పెండ్లిచేసినారు. కనకం మంచి తెలివితేటలుగలది. మనవిశ్వనాథం లాటిది కాదు. సీతారామయ్యకి అంతడబ్బు లేకపోతేకూడా రొఖ్ఖంగా సుమారు పాతికవేలున్నాయి . భూముల్లోకూడా ధాన్యపుసరుకులన్నీ పండుతాయి. మంచిసామర్థ్యంకలవాడు.

783

కనకం పినతల్లి కొంచెం పేదరాలు. ఆట్టే డబ్బు లేదు. కాబట్టి ఆమె బిడ్డ పెద్దవాడైన సత్యం వీళ్ల దగ్గిరనే వున్నాడు. సత్యానికి పదహారేళ్లు. నాలుగేళ్లనుంచి ఇక్కడనే వున్నాడు. సత్యానికి హాస్యంచేయడమంటే బహుసరదా. ఎప్పుడుచూసినా విశ్వనాథాన్ని వేళాకోళం చేస్తూనేవుంటాడు. అప్పుడప్పుడు కనకాన్ని కూడా "బావగారువస్తారోయ్, తప్పేలాబిళ్లలోయ్, నీకోయ్" అని యేడిపించేవాడు సత్యం. అప్పుడు కనకానికి ఉడుకుమోత్తనంవచ్చేది. వస్తే యేంచేయగలదు? ఇంక ఆవేళ చెప్పనక్కరలేదు. సత్యానికి విశ్వనాథం చూడనప్పుడంతా తప్పేలాబిళ్ల, తప్పేలాబిళ్ల అని స్మరణచేస్తూ వుండేవాడు. నాలుగైదురోజులయింది అల్లుడొచ్చి ఒకనాడైనా తప్పేలాబిళ్లలు చేయవద్దా అని ఆవేళచేసింది రవణమ్మ.

రాత్రిభోంచేసేటప్పుడు అందరి ఆకుల్లోనూ తప్పేలాబిళ్లలువేసింది. అందరూ రెండు మూడు వెయ్యగానే "చాలు", "చాలు" అన్నారు. విశ్వనాథం అయిదారువేస్తేకూడా చాలనలేదు. అదిచూచి మారుపట్టుకొద్దామని వెళ్లిపోయింది రవణమ్మ. విశ్వనాథం తినేసి ఇటూఅటూ చూస్తున్నాడు. ఇంకా కావలెనేమో అని పట్టుకొచ్చి ఇంకోనాల్గువేసింది. వేసినాకూడా చాలుఅనలేదు. పళ్లెంనిండా బిళ్లలువుంటేకూడా ఇంకావేస్తే అల్లుడికి జబ్బు చేస్తుందేమో అని యెదురుగుండావున్న వంటఇంట్లోపెట్టి మూసింది రవణమ్మ.

అదిచూసి సత్యం "బావా! వేసుకో. ఆలాసంకోచంపడతావేమిటి? నీకిష్టమని మాకు తెలియదనుకున్నావా? తిను; తిను. ఇంకొంచెంవేసుకో" అన్నాడు. విశ్వనాథం మాటాడకుండా తినివేసి లేచిపోయేడు. అందరూలేచి తాంబూలాలువేసుకొని యెవరిపక్కలు వాళ్లువేసుకుని పడుకున్నారు.

రవణమ్మ భోజనం అయినతరువాత ఇల్లంతాసర్దుకొని, వంటఇంటి కెదురుగాఉన్న సావిట్లో పక్కేసుకొని కనకం, తనూ పడుకున్నారు.

ఆవిడకు చాలాసేపటిదాకా నిద్దరపట్టలేదు. తరువాత కళ్లుమూసుకొని పడుకుంది. కునుకుపట్టుతూవుంది. ఆసమయంలో యేదోకొంచెం చప్పుడైనట్టు వినిపిస్తే కళ్లుతెరిచి చూసింది. అది వెన్నెలకాలం గనుక బాగావెలుతురుగావుంది. విశ్వనాథం జరీకండువా వేసుకొని వంటఇంట్లోకి వెళ్లుతూన్నట్టు కనబడ్డది. అదిచూచి అల్లుడే తప్పేలాబిళ్లలకోసం వెడుతున్నాడని చప్పుడుచేయకుండాపడుకుంది. పడుకుని 'నేనువేసినవి చాలలేదు కాబోలు అందుకనే వెడుతున్నాడు. ఇంతతిండిమీద ఆశవుంటేయేలాగు, వెర్రిబాగులవాడు, చూసి చూసి దొరికింది మాకీసంబంధం, మనఘటన ఈలాగుంది అని అనుకుంటూవుంది. అంత లోపల దగ్గులూ, తుమ్ములూ యెక్కువయి ఉక్కిరిబిక్కిరి చేసుకుంటూన్నట్టు వినపడ్డది. "అయ్యో? ఇలాగకష్టపడుతున్నాడే; అప్పుడే ఇంకా వెయ్యమనకూడదా" అని దీపం వెలిగించి వంటఇంటిదగ్గరకు వెళ్లింది రవణమ్మ. అంతలోపల దభాలుని రవణమ్మని కిందతోసి దాటుకొని ఒక్కగంతులోవెళ్లిపోయినాడు.

784

రవణమ్మ కిందపడి మోచేతిఎముక విరిగిపోయి బాధతాళలేక "అయ్యో, అయ్యో" అనియేడుస్తూవుంది. ఆయేడుపువిని ఇంట్లోవున్నవాళ్లందరూలేచి "ఏమి? ఏమి?"అనిఅడుగుతున్నారు. చుట్టుపక్కలవాళ్లందరూకూడావచ్చి "ఏమిటి? రవణమ్మగారూ! ఎందుకలా యేడుస్తున్నారూ? యేంజరిగింది?" అని వాళ్లోపక్క అడుగుతున్నారు.

అంతలోపల విశ్వనాథం లేచి "నాజరిగ వేసినకండువాకూడా కనిపించడంలేదే. ఎవరుతీసేరు. దొంగలేవొచ్చేరా?" అంటున్నాడు.

సత్యంలేచి "దొడ్డితలుపు తెరిచివుంది. పెదనాయనా" అంటున్నాడు.

కనకం "పెట్టెలన్నీ విజ్జిమ్మివున్నాయమ్మోయ్; దొంగలే వొచ్చేరేవు. నీచెయ్యి కూడావిరిగిందేవు"అని అరుస్తూంది. ఎవరికితోచినట్టు వాళ్లు అంటున్నారు.

రవణమ్మ మోచేతినిపట్టుకుని ఆశ్చర్యపడి "దొంగా? దొంగా? నేను అల్లుడు అనుకున్నానే" అంది.

"అల్లుడేమిటి?"అని అడిగినాడు సీతారామయ్య.

"వంటఇంట్లో దూరినప్పుడు అల్లుడుపరిగకండువా కనిపించినందువల్ల అల్లుడేమో అనుకున్నాను. తరువాత ఆదగ్గులూ, తుమ్ములూకూడా వింటే పాలబారుతూందేమో అని దీపంవెలిగించుకుని వచ్చేను. అంతలోపల....."

"నీకెంతబుద్ధే? అర్ధరాత్రివేళ అల్లుడెందుకు వంటఇంట్లోకి వెడతాడు? నీకింత తెలియక పోయిందా?"

"ఆయనకు తప్పేలాబిళ్లలు ఇష్టమే, అవిమూసిపెట్టేను. వాటికోసరం వెడుతున్నాడేమో అని."

"చాలు. నోరుమూయ్. నీకేమి పిచ్చియెత్తిందా?......"

ఆమాటవింటూనే విశ్వనాథం అమాయకత్వం అంతా పోయి అతనికి చెప్పరానంత కోపంవచ్చింది.

"ఓహో! తత్తత్తప్పేలాబిళ్లలకు గగ్గగతిలేక మీయింటికి వచ్చేననుకున్నారా?"అని కోపాన్ని అణుచుకోలేక, స త్తితో మాటాడలేకపోయేడు విశ్వనాథం.

సీతారామయ్య తనభార్యని కసురుకొని వంటఇంటికి అందరితోటీకలసి వెళ్లినాడు.

అక్కడ కందిపొడుం ఇల్లంతాచల్లివుంది. అదిచూచి "అయ్యో! ఆవెధవ ఈకంది పొడుం తినేదేమోఅనుకొని బొక్కి దగ్గులూతుమ్ములూతోటి ఆలాచచ్చేడు"అందిరవణమ్మ.

ఆరాత్రిఅంతా విశ్వనాథం ఎవ్వరితోటీ పలుకకుండా ఒకచోటపడుక్కొని, తెల్లవారు ఝామునలేచి యెవ్వరితోనూ చెప్పకుండా వెళ్లిపోయెను.

పాపం, రవణమ్మగారికి మూడువందలరూపాయిలూపోయి, మోచెయ్యీవిరిగింది; యిదీకాకుండా, అల్లుడుకూడా కోపగించుకొని పోయినాడు.